# ఇష్టం



వేదగిరి రాంబాబు

"ఇవాళయినా ఆ గుడ్డల్ని టైలర్ కిస్తారా లేదా?" ఆఫీసుకి బయల్దేర బోతూంటే భవాని అడిగిన ఆ ప్రశ్నకి వొళ్ళు మండిపోయింది

తను భార్య, నేను భర్త నా ఆజ్ఞను తను పాటించాలా! తనాజ్ఞను నేను పాటించాలా?

అసలు నాకు చెప్పకుండా నాకు గుడ్డలు తేవడం తన మొదటి తప్పు. ఒకవేళ తెచ్చిందే అనుకో. అవి నాకిష్టం లేని రంగువని తెలిసికూడా అవే కుట్టించమని నన్ను వేధించడం రెండో తప్పు అంతకన్నా భయంకరమైన మూడో తప్పు నే నూరుకుంటున్నాను కదా అని ఆ వేధింపుల్ని సాధింపుల్లోకి, ఆజ్ఞల్లోకి దించడం!

ఇంకా క్షమించుకుంటూ పోతే మరింకెన్ని తప్పుల్ని కాయాల్సి వస్తుందో!

ఇంక వుపేక్షించకూడదు. గట్టి డోస్ ఇవ్వాలి.

"మిమ్మల్నే! ఇవాళగనుక మీరా గుడ్డల్ని టైలర్ కిచ్చి రాకపోయారో రాత్రినించీ నే నన్నం ముట్టుకోను ఇక మీ ఇష్టం" ఖచ్చితంగా ఆమె అలా అనే సరికి నాకు వళ్ళు మండిపోయింది

"నేనూ ఖచ్చితంగానే చెప్తున్నాను. ఆ గుడ్డల్ని నేను కుట్టించుకోను. ఎట్లాగూ కొనేశావు కాబట్టి, వాటిని ఈసారి మీతమ్ము డిక్కడికి వచ్చినప్పు డతనికిచ్చేయ్! గబగబా బయటి కొచ్చేసాను."

ఎంత భార్యయితే మాత్రం అంత అజమాయిషీనా? నేను తొడుక్కునే గుడ్డలుకూడా తన కిష్టమయినవే అయి వుండాలా? ఇక నామీద కూడా నాకు ఇష్టాయిష్టాలే వుండకూడదా?

సరిగా క్రిందటి సంవత్సరం ఈపాటికి తనెవరో, నేనెవరో! ఈ ఒక్క సంవత్సరంలోనే నామీద ఈమెకింత అధికారం వచ్చిందా! చిన్నప్పట్నించీ పెంచి పెద్దచేసిన తల్లిదండ్రులే నాతో ఎప్పుడూ ఇట్లా మాట్లాడలేదు. నాకెప్పుడు గుడ్డలు కొనాల్సివచ్చినా నాన్నగారు నన్ను వెంటపెట్టుకునే వెళ్ళేవారు. నాకిష్టమయినవాటినే కొనేవారు. అట్లాంటిది నిన్నగాక మొన్న వచ్చిన ఈమె అధికారపూర్వకంగా 'ఆ గుడ్డల్ని కుట్టించుకో'మ్మని ఆజ్ఞాపిస్తే పాటిస్తానా? చచ్చినా పాటించను. ఏమయినాసరే, ఆ గుడ్డల్ని కుట్టించుకోను గాక కుట్టించుకోను

నేను బస్‌స్టాప్‌కి చేరుకోవడం, బస్సు రావడం ఒకేసారి జరిగాయ్.

పద్మవ్యూహంలోకి జొరబడ్డట్లు జనాల్ని తోసుకుంటూ ఎక్కగానే బయల్దేరింది బస్సు

రోజూ ఇదో నరకం!

ఆఫీసు సమయాల్లో బస్సులన్నీ రద్దీ. బస్‌స్టాప్‌లలో బస్సులాపడమే గగనం. ఒకవేళ ఆపినా బస్సెక్కడం కష్టం. కష్టాలన్నీ ఓర్చి బస్సెక్కితే జనం మధ్య ఇలా నలిగిపోవాలి.

తప్పదు! మధ్యతరగతి మనిషిగా పుట్టినందుకు ఇటువంటి నరకాల నన్నింటినీ భరించి తీరాల్సిందే!

దాదాపు ఓ అరగంట అలా నరకాన్ననుభవించింతర్వాత సికింద్రాబాద్ స్టేషన్ దగ్గర బస్సు దిగి ఆఫీసువేపు నడవసాగాను.

"రవీ...." వెనుకనించి ఎవరో పిల్చిన పిలుపుతో టక్కున ఆగిపోయాను.

బాగా పరిచయమయిన గొంతులాగే వుంది.

వెనక్కి తిరిగాను.

ఆశ్చర్యం!

ఆమె.... ఆమె....

అవును! ఆమె రాజేశ్వరే! సందేహంలేదు.

మరి, ఇక్కడుండేమిటి !

హఠాత్తుగా ఆమె నక్కడ, అలా చూసేసరికి ఆశ్చర్యం, ఆశ్చర్యంతోపాటు కొద్దిగా కంగారు కలిగింది.

"ఏమిట్రవీ అంతగా ఆలో చిస్తున్నావ్ ! నన్ను గుర్తుపట్టలేదా ?"

నిన్ను గుర్తుపట్టలేనా రాజేశ్వరీ ! నీలో ఎన్ని మార్పులొచ్చినా సరే, ఎన్ని వేలమంది మధ్యనున్నా సరే నిన్ను గుర్తుపట్టగల్ను ! కాకపోతే హఠాత్తుగా దర్శన మిచ్చేసరికి కొద్దిగా కంగారు. అంతే !

"అబ్బే గుర్తించక కాదు.... ఏవిటీ వున్నట్లుండి ఇలా హఠాత్తుగా దర్శన మిచ్చావ్ !" అన్నాను నా కంగారుని కప్పిపుచ్చుకుని నవ్వేస్తూ.

"ఇక్కడ నిన్ను చూడగానే నేనూ ఆశ్చర్యపోయాను కానీ నీలా అలా ఆశ్చర్యంలోనే మునిగిపోయి వూరుకో లేదు. వెంటనే తేరుకొని నిన్ను కేకేశాను" తనూ నవ్వింది.

ఆమె నవ్వుతూంటే ఎఱ్ఱని పెదాల మధ్య అందమయిన తెల్లని పలువరుస తళుక్కున మెరిసింది.

అదే .. ఆ అందమే, మొదట్నించీ ఆమె అంటే నేను పడిచచ్చేట్లు చేసేది. అలా ఆమె నవ్వుతుంటే అందం మరింత విజృంభిస్తుంది. వెంటనే ఆమెను దగ్గరకు లాక్కోవాలని...ఇంకా ఏమేమో చేయాలనీ మనసు వువ్విళ్ళూరుతుంది.

బలవంతాన నన్ను నేను నిగ్రహించు కోసాగాను.

"ఇన్నాళ్ళ తరువాత కనిపిస్తే రక రకా విషయాలన్నీ ఏకరువుపెట్టా ల్సింది పోయి ఏమిటి అలా నిలువుగుడ్లే సుకుని చూస్తూ వుండిపోయావ్ !" మళ్ళీ నవ్వింది.

వద్దు రాజేశ్వరీ ! ప్లీజ్ నువ్వలా నవ్వకు ! సభ్యతకూడా మరచిపోయి ఏం చేస్తానో అనే భయం నిలువునా నన్ను వొణికించేస్తోంది.

"అదిగో మా బస్సు వచ్చేస్తోంది. నువ్వివాళ సాయంత్రం తప్పకుండా మా ఇంటికి వస్తున్నావ్. నీకోసం ఎదురు చూస్తుంటాను" చటుక్కున నా చేతిలో వున్న వీక్లీనందుకుని, దానిమీద తనింటి అడ్రసు రాసిచ్చింది

ఇంతలో ఆమెక్కావల్సిన బస్సువచ్చి ఆగడంతో సాయంత్రం తప్పకుండా రమ్మని మరోసారి చెప్పి, బస్సువేపు నడిచింది.

ఆమెలో అప్పటికి ఇప్పటికి వయసు తెచ్చిన నిండుతనం తప్ప మరే మార్పూ కనిపించలేదు నాకు ! అప్పుడెలా చొరవగా మాట్లాడేదో, ఇప్పుడూ అలాగే మాట్లాడుతోంది.

"సాయంత్రం తప్పకుండా వస్తు న్నావ్ కదూ ?" బస్సెక్కాం తర్వాత కిటికీలోంచి తల బయిటికి పెట్టి మళ్ళీ అడిగింది

"తప్పకుండా వస్తాను" చిన్నగా నవ్వాను చెయ్యూపుతూ.

తనూ చెయ్యూపింది.

బస్సు బయల్దేరడంతో నెమ్మదిగా అక్కడ్నించి కదిలాను. శారీరకంగా ఆమెకు దూరమవుతున్నా మానసికంగా ఆమెకు దూరం కాలేకపోతున్నాను. ఆమెలో వున్న ఆకర్షణకి నేనంతగా కట్టుబడిపోయాను. అసలామెతో పరిచయమే చాలా విచిత్రంగా జరిగింది.

రాజేశ్వరీ వాళ్ళ నాన్నగారికి కొత్తగా మా వూరు బదిలీ అయి వచ్చారు. వాళ్ళిల్లు మా వీధిలోనే!

రోజూ వాళ్ళింటికి, మా ఇంటికి రాకపోకలుండేవి. ప్రతిరోజూ మా గులాబీ చెట్టుకుపూసే పువ్వు కోసుకు పోవడానికి వచ్చేది రాజేశ్వరి.

ఓ రోజు ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో వచ్చింది. నేనొక్కడ్నే వుండడం చూసి సిగ్గుపడిపోయింది.

వెనక్కి తిరిగి వెళ్ళిపోతూంటే నేనే కేకేశాను.

"ఏమండీ! వెళ్ళిపోతున్నారేం? మీ కోసం గులాబీ పువ్వు కోసి వుంచాను..." అంటూ లోపలికెళ్ళి పువ్వును తీసుకొచ్చి ఆమె కందించాను.

"చాలా థాంక్సండి...." అందామె నావంక చూస్తూ.

"మీరీ గులాబీపువ్వు పెట్టుకుంటే ఎంత బావుంటారో తెలుసాండీ! మిమ్మల్నిలా గంటల తరబడీ చూస్తూండాలనిపిస్తుంది...."

ఆమె కిలకిల నవ్వేసి వెళ్ళిపోయింది.

ఆ మర్నాడు ఆమె వచ్చేసరికి నేను గులాబీపువ్వు కోసి, వాకిట్లోనే ఆమె కోసం ఎదురుచూస్తూ నిల్చున్నాను.

ఆమె ఆశ్చర్యపోయింది

"మీరిలా ఇవ్వడం ఎవరయినా చూస్తే...." అంది సంశయంగా.

"నాకు ఆనందం కల్గించే పనిచేయడానికి భయమెందుకూ?" అన్నాను ధైర్యంగా.

అక్కడ్నించి ఇద్దరం కలిసే కాలేజీకి బయల్దేరాం.

ఇద్దరిదీ ఒకే క్లాస్‌కూడా కావడంతో మా పరిచయం మరింత తొందరగా పెరిగిపోయింది.

అలా పెరిగిపోయిన పరిచయం, ఆ తర్వాత నెమ్మదిగా ప్రేమలోకి దిగిపోయింది.

ఆమెను చూడకుండా నేను, నన్ను చూడకుండా ఆమె వుండలేని స్థితిలోకి వచ్చేశాం. క్రమంగా కాలేజీలో కూడా మా గురించి గుసగుసలు ప్రారంభమయ్యాయ్. అయినా ఇద్దరం వాటిని లక్ష్యపెట్టలేదు మరింత చనువుగా వుండసాగాం.

ఒకళ్ళకి తెలీని పాఠాలు మరొకళ్ళం చెప్పడం వ కతో వీలైనప్పుడల్లా ఒక

శ్శింటికి మరొకళ్ళం వెళ్ళడం ప్రారం భించాం

ఆఫీసుకి చేరుకున్నాను రాజేశ్వరి గురించిన తియ్యటి ఆలోచనలవల్ల నడిచినట్లే అనిపించలేదు

రిజిష్టర్‌లో సంతకంచేసి సీట్లో కూలబడ్డాను

సీట్లో కూర్చున్న తరువాత కూడా మనసు పనిమీద లగ్నం కావడంలేదు మనసు నిండా రాజేశ్వరే!

ఆ రోజు కాలేజీకి వెళ్ళేప్పుడు—

"రవీ! నువ్వివాళ ఓ పనిచేయాలి" అంది దగ్గరకొచ్చి

"ఏవిటీ?" అడిగాను

"నువ్వు తెల్ల పాంటు, తెల్ల షర్టు వేసుకుంటే ఎంతో బావుంటావ్ "

"బావుంది! నాకసలు తెల్లగుడ్డలే లేవు"

"అందుకే ఇదిగో ఈ డబ్బులు తీసుకెళ్ళి ఇవాళ సాయంత్రం తెల్ల పాంటు, షర్టు పీసెస్ తీసుకో," అంటూ తన గుప్పెట్లోవున్న నోట్లని నా చేతిలో పెట్టబోయింది

"అదేవిటీ! ఎక్కడివీ డబ్బులు?" కంగారుగానూ, అయోమయంగానూ అడిగాను

"నాన్నగారు నా పుట్టింరోజుకి శారీ కొనుక్కోమని ఇచ్చారు"

"మరి ఆ డబ్బులు కాస్తా నా కిచ్చేస్తే ?"

"మరేం పర్లేదు బస్సులో ఎక్కడో పోయాయని చెప్తాను" ఆ మాటల్ని ఎంతో మామూలుగా అనేసినా నా మనసులో విపరీతంగా నాటుకు పోయాయి! నేనంటే తనకెంత అభిమానం! తన కిష్టమైన డ్రెస్‌లో నన్ను చూడాలని ఎంతగా వువ్విళ్ళూరు తోంది! నా మనసానందంతో ఉబ్బి తబ్బిబ్బయి పోయింది

"నువ్వు చెప్పినట్లే చేస్తాను కానీ ఒక్క షరతు" అన్నాను.

"ఏవిటీ?"

"నేను గుడ్డల్ని కొనుక్కోవాలని మా నాన్నగార్ని డబ్బడుగుతాను అవి నీకిస్తాను వాటితో నువ్వు గ్రీన్ పెరికాట్ శారీ, బ్లవుజు తీసుకోవాలి. ఓ కే?" అడిగాను

"అంటే బదులా?" ఆమె అలా అడగడంలో ధ్వనించిన బాధ నన్ను మరింత బాధపెట్టింది

"అదికాదు! అలా చెయ్యడంవల్ల మనిద్దరి కోరికలూ తీరడమే కాకుండా మనం ఇంట్లో అబద్ధాలు చెపాల్సిన పని కూడా వుండదు" అన్నాడు ఆమె ననునయిస్తూ.

దాదాపు ఓ అరగంట బ్రతిమాలిం తర్వాత ఆమె అందుకు వొప్పుకుంది

గిరుక్కున వారం తిరిగింది

నేను తెల్ల పాంటు, షర్టు, ఆమె గ్రీన్ శారీ, బ్లవుజు వేసుకుని క్లాస్

ఎగ్గొట్టి ఉదయశంకర్‌లో కాఫీ తాగి మరీ మాట్నీకి చెక్కేశాం ఆమె పుట్టినరోజు నాడు

"సార్ ! మిమ్మల్ని మేనేజర్‌గారు పిలుస్తున్నారు" ప్యూన్ పలకరింపుతో ఆలోచనల్లోంచి బయటపడి, గబగబా మేనేజర్ రూమ్‌కేసి నడిచాను

ఆయన్తో ఏవేవో ఆఫీసు విషయాలు హోరాహోరిన చర్చించి, ఓ అరగంట దాటింతర్వాత బయటపడ్డాను

ఆ రోజు చెయ్యాల్సిన పనులెన్నో వున్నాయి కానీ చెయ్యబుద్ధి పుట్టడం లేదు. ఆలోచనలు రాజేశ్వరిని వదిలి ఇవతలికి రానంటున్నాయ్ !

డిగ్రీ చదివిన ఆ మూడేళ్ళు నేనెన్నటికీ మర్చిపోలేదు

ఎన్నో అనుభూతులు !

క్లాసులోవున్న ఆ కాసేపూ దగ్గరే వుండి కూడా దూరాన్ని అనుభవించాల్సి వచ్చినందుకు ఎంతో బాధపడిపోయే వాళ్ళం కాలేజీ అయిపోగానే ఇద్దరం కలిసే బయల్దేరేవాళ్ళం ఇంటికి వచ్చిం తర్వాత కూడా ఏదో ఒక వంక పెట్టుకుని ఎవరో ఒకరి ఇంటిదగ్గరకి చేరి కబుర్లు చెప్పుకుంటూ గడిపేవాళ్ళం

అప్పుడు మా ఇద్దరి మధ్యా ఏర్పడ్డ బంధాన్ని ఇద్దరి ఇళ్ళలోనూ గమనించే వుంటారు కానీ మా పరిచయం హద్దులు మీరదన్న నమ్మకంతో ఏమీ చెప్పలేక వూరుకునేవాళ్ళు

అయితే ఇద్దరి పెద్దలూ మా వివాహాన్ని హర్షించరనే విషయాన్ని మేం అప్పుడు గమనించలేకపోయాం మా ఇద్దరి మధ్య కులం ఓ పెద్ద అడ్డుగోడ కట్టిందనే విషయాన్నికూడా మేం గుర్తించలేదు

డిగ్రీ అయిపోంగానే నన్ను వైజాగ్‌లో వున్న మా మావయ్య గారింటికి ప్రయాణం కట్టించారు.

నేను వెళ్ళనని మొండికేశాను. ఇక్కడే వుండి ఏదయినా వుద్యోగం చూసుకుంటానని గొడవచేశాను.


మామయ్య దగ్గరికి నన్నెందుకు పంపించాలనుకుంటున్నారో తెలుసు నాకు. ఆయన నాకు పోస్ట్‌గ్రాడ్యు యేషన్ తనింట్లో వుంచి చెప్పించడమే కాకుండా, వుద్యోగాన్ని కూడా ఇప్పించి తన కూతుర్నిచ్చి చెయ్యాలనే వూహాలో వున్నాడు మావాళ్ళుకూడా దానికి మద్దత్తు నిస్తున్నారు అందుకే ఈ ప్రయాణం

ససేమిరా వెళ్ళనన్నాను

వైజాక్ వెళ్ళకపోతే వెంటనే మరో పిల్లనెవరినైనా చూసి ముడేయించేస్తాను కాని, రాజేశ్వరితో తిరగనివ్వనని నాన్న గారు ఖచ్చితంగా చెప్పేశారు.

మామయ్య కూతుర్ని చేసుకోకపోతే తనే విషమో తిని చచ్చిపోతానని అమ్మ బెదిరించసాగింది.

ఒక ప్రక్క కన్న తల్లిదండ్రులు




మరో ప్రక్క ప్రాణానికన్నా మిన్నగా ప్రేమించిన రాజేశ్వరి

ఎటూ తేల్చుకోలేని విషమ పరిస్థితి.

రాజేశ్వరి వాళ్ళింటికి బయల్దేరాను.

ఇంటికి తాళ్ళం వేసుంది

ఆ రాత్రి అమ్మద్వారా అసలు విషయం తెలిసింది కేవలం నానించి దూరం చేయాలనే ఆమెని వాళ్ళ తల్లిదండ్రులు స్వగ్రామానికి తీసుకెళ్ళారని, ఇంక తిరిగొచ్చేది ఆమె తల్లిదండ్రులేనని, ఆమె రాదని!

ఒక్కసారి పరిస్థితులన్నీ తిరగబడే సరికి వుక్కిరి బిక్కిరయ్యాను

వైజాగ్ వచ్చేశాను.

తర్వాత రాజేశ్వరికి ఎన్ని వుత్తరాలు రాసినా జవాబులేదు

ప్రతిరోజూ ఆమె తాలూకు జ్ఞాపకాలు గుర్తుకొచ్చి బాధించసాగాయ్. ఆమెను చూడకుండా వుండడం ఇక నా వల్లకాదు. ఇంటికి బయల్దేరదామనుకొంటుండగా వచ్చింది - రాజేశ్వరి పెళ్ళి శుభలేఖ

రాజేశ్వరి చచ్చినా ఈ పెళ్ళికి వొప్పుకోదు

బలవంతాన ఆమె తల వంచి వుంటారు

వెంటనే వెళ్ళి ఆమెను తీసుకొచ్చేయాలి

మరోసారి శుభలేఖను చూడగానే దుఃఖం ఆగలేదు

ఆ రాత్రే పెళ్ళి!

మరికొన్ని గంటల్లో రాజేశ్వరి మరె

వరికో స్వంతం అయిపోతోంది. ఎలా?

ఆ రాత్రంతా అలా ఏడుస్తూనే పడుకున్నాను

మర్నాడుదయం లేచింతర్వాత ఓ విధమయిన నిర్లిప్తత మనసులో చోటు చేసుకుంది.

ఈపాటికి రాజేశ్వరి మరెవరికో స్వంతం అయిపోయి వుంటుంది ఇప్పు డెంత బాధపడ్డా లాభంలేదు రాజేశ్వరి నాది కాకపోయినప్పుడు మామయ్య కూతురు భవానైనా ఒకటే, మరో సుబ్బ లక్ష్మైనా ఒకటే!

ఆ రోజునించే జీవితంలో రాజీ పడడం మొదలుపెట్టాను. ఆ తర్వాత మళ్ళీ రాజేశ్వరిని చూడడమే పడలేదు.

ఇన్నాళ్ళ తరువాత ఇవాళ ఇలా హఠాత్తుగా కనపడింది అప్పటికి, ఇప్ప టికి ఆమెకు నామీదున్న ప్రేమలో ఏ మాత్రం భేదంలేదు ఇప్పుడూ తనని పూర్వంలాగానే అభిమానిస్తుంది

తళుక్కున రాజేశ్వరి నవ్వు గుర్తు కొచ్చింది

ఇంకా ఆ అందం నాకోసం పడిగాపులు పడుతోంది విపరీతమైన గర్వం కల్గింది నాకు

ఒక గంట ముందు పర్మిషన్ తీసుకుని ఇంటికెళ్ళాను

గబగబా పెట్టెలోవున్న పాంటూ, షర్టూ తీసి వేసుకున్నాను

కుడిచేతికి గడియారం పెట్టుకుంటే రాజేశ్వరికి ఇష్టం వెంటనే గడియారాన్ని ఎడంచేతినించి కుడిచేతికి మార్చేశాను.

"నువ్వలా తెల్ల పాంటూ, షర్టూ వేసుకుని టక్‌చేసి, ఫుల్‌బూట్ వేసుకుంటే ఎంత బావుంటావో తెల్సా" రాజేశ్వరి మాటలు గుర్తుకొచ్చాయ్.

వెంటనే కుర్చీలో కూలబడి బూట్లు తొడగసాగాను

ఇంతలో భవాని కాఫీ తెచ్చి ఎదురుగా వున్న టీపాయ్ మీద పెట్టింది.

బూట్లు తొడుక్కోవడం కాగానే, ఒక్కగుక్కలో కాఫీ తాగి, బయటికి బయల్దేరాను

"బయటికి వెళ్తున్నట్టున్నారుగా ఆ గుడ్డల్ని చాకలికిచ్చి పోగూడదూ" నెమ్మదిగా అంది భవాని

ఆ మాటలు వినబడగానే నాకు చర్రున మండింది

"చెప్పేనుగా—ఆ గుడ్డల్ని నేను కుట్టించుకోనని" గబగబా బయటి కొచ్చేశాను.

అటుగా పోతున్న ఆటోని కేకేసి, రాజేశ్వరి ఇంటి లొకాలిటీ చెప్పాను.

పది నిముషాలు కాకముందే ఆటో వాళ్ళింటి ముందాగింది.

నన్ను చూడగానే నవ్వుతూ ఎదురొచ్చింది రాజేశ్వరి

ఆమెను చూడగానే విపరీతమైన ఆనందం కల్గింది నేనామె అభిరుచుల కనుగుణంగా తయారై వచ్చినట్లే, ఆమె నా అభిరుచులకు అనుగుణంగా అలంక



రించుకుంది గ్రీన్ శారీ, గ్రీన్ బ్లవుజు, పాపిట్లో కుంకుమ

ఓహ్ రాజేశ్వరీ! ఇంకా నువ్వు నా ఇష్టాల్ని మరచిపోలేదన్న మాట! నువ్వేకాదు, నేనూ నీ ఇష్టాల్ని మరచిపోలేదు. ఇదిగో అందుకు నిదర్శనమే ప్రస్తుత నా రూపం

నవ్వుతూ మెల్లెక్కసాగాను

"రండి రండి మీకోసమే ఎదురు చూస్తున్నాం." నవ్వుతూ అంది రాజేశ్వరి

ఆమె ఎఱ్ఱని పెదాల మధ్య, తెల్లని పలువరుస తళుక్కుమంది. యు ఆర్ ఎ

బ్యూటీ క్వీన్ రాజేశ్వరీ ఈ అందం ఎప్పుడూ నాదేనని తెలిసికూడా దూరంగా తిరుగుతున్న మూర్ఖుడ్ని ఇవాళ్టితో ఆ మూర్ఖత్వానికి స్వస్తి చెప్పేస్తాను.

"రాజేశ్వరీ! నాకు గ్రీన్ శారీ అంటే ఇష్టమన్న సంగతి నీకింకా గుర్తుందా?" ఆమెకేసి నడుస్తూ ఆప్యాయంగా అడిగాను.

"గ్రీన్ శారీ అంటే మావారికెంతో ఇష్టం. వారి ఇష్టాలే నా అలంకరణలు " ఆమె వెనక్కి తిరిగి "ఏమండీ! ఇంకా ఎంతసేపు మీ అలంకరణ రవి వచ్చేశారు " గట్టిగా అంది

ఆమె మాటలు వినగానే హతాశుడ్నయ్యాను. అతనింట్లోనే వున్నాడన్న మాట! ఇంకా నయం తొందరపడలేదు.

"ఇదిగో వచ్చేశా " నవ్వుతూ బయటకొచ్చిన ఆ యువకుడ్ని చూడగానే ఇనుపరాడ్‌తో నెత్తిన మోదినట్లయింది

తెల్ల పాంటు, తెల్ల షర్టు, ఫుల్ షూస్. కుడిచేతికి వాచీ అందంగా నవ్వుతూ విష్ చేశాడు

నాకు మతి పోతోంది

అక్కడ నిలబడలేకపోతున్నాను.

"కూర్చోండి " నవ్వుతూనే అన్నాడతను

కూలబడ్డాను పక్కనేవున్న కుర్చీలో.

"మీగురించి అప్పుడప్పుడూ మా ఆవిడ చెప్తూంటుంది మీరిద్దరూ మంచి స్నేహితులటకదా "

అతను చెప్పే మాటలు నా చెవిలో దూరడంలేదు అప్పుడెప్పుడో రాజేంద్ర చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయ్—

ఆడవాళ్ళకి తమ గురించికన్నా భర్త గురించే ఎక్కువ ధ్యాస! భర్తను తమ ఇష్టాలకి అనుగుణంగా తీర్చిదిద్దుకోవడం వాళ్ళకెంతో ఇష్టం అని

నిజమే! అప్పుడు నేను తన భర్తనవుతాననే వుద్దేశంతో రాజేశ్వరి అలా ప్రవర్తించింది ఇప్పుడా కోరికలన్నీ భర్తతో తీర్చుకుంటుంది. నేనిప్పుడు పరాయివాడ్ని ఇంకా నయం ఇందాక ఇంకా చొరవ తీసుకునుంటే చెంప వాచిపోయి వుండేది.

చటుక్కున భవాని గుర్తుకొచ్చింది నాకు

పిచ్చిపిల్ల! తనింటి ఖర్చు కిచ్చిందాంట్లో దాచి, నాకోసం తనకిష్టమైన గుడ్డల్ని కొంది. నేనేమో మొండిగా ఆలోచించి ఆమెను హింసపెట్టాను. వెంటనే వెళ్ళి ఆ గుడ్డల్ని టైలరుకివ్వాలి

భవాని ఆ గుడ్డల్ని కుట్టించుకోమని నన్నెందుకు బలవంతం చేస్తోందో కూడా అర్ధమైపోయింది

రక్కున లేచి నిలబడ్డాను.

"అదేంటి! లేచి నిల్డారు ?" ఇద్దరూ ఒకేసారి అడిగారు

"మళ్ళీ రేపు సాయంత్రం మా ఆవిడతో కలిసి వస్తాను ఇప్పుడో అర్జంటుపనుంది వస్తా" వాళ్ళ మాటల్ని వినిపించుకోకుండా గబగబా బయటికొచ్చేశాను.

———